క్లుప్తంగా

26 నుంచి స్లాటు బుకింగ్ తప్పనిసరి



గురజాల: ఈ నెల 26వ తేదీ నుంచి స్లాటు బుకింగ్ తప్పనిసరి అని సబ్ రిజిస్ట్రార్ పి. ప్రశాంతి అన్నారు. ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ.. రెండో దశలో ఈ నెల 26వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు ముందుగా స్లాట్ బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. అందులో కేటాయించిన సమయంలోపు ఇరు వర్గాల వారు కార్యాలయానికి రావాలన్నారు. క్రయవిక్రయదారుల సెల్‌ఫోన్‌లకు ఓటీపీ వస్తుందని, అది చెప్పిన తరువాతనే రిజిస్ట్రేషన్ ప్రారంభిసస్తామని తెలిపారు. రోజుకు 39 దస్తావేజులకు అవకాశం ఇచ్చినట్లు పేర్కొన్నారు. స్లాటు బుకింగ్‌పై అవగాహన కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆర్‌టీఈ కింద పాఠశాలల్లో ప్రవేశాలు



మాచర్ల రూరల్: విద్యా హక్కు చట్టం ద్వారా ప్రైవేటు, ఎయిడెడ్, కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యా శాఖాధికారి అల్లి సురేష్ కోరారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆయా పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా అందించాలని ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. సంబంధిత వెబ్‌సైట్‌లో ఈ నెల 25 నుంచి మే నెల 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాదాల వేళ అప్రమత్తత అవసరం



మాచర్ల రూరల్: అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉంటే భారీ నష్టాన్ని నివారించవచ్చునని అగ్నిమాపక అధికారి కె.సునీల్ కుమార్ తెలిపారు. అగ్నిమాపక భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఫరీద్ గ్యాస్ గోడౌన్‌లో వినియోగదారులతో ఆయన మాట్లాడారు. అత్యవసర సమయంలో అగ్నిమాపక సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో అమూల్యమని తెలిపారు. ప్రమాదం సంభవించినప్పుడు 101కు సమాచారమివ్వాలని కోరారు. పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లలో ప్రమాదాల నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అగ్నిమాపక ఉద్యోగులు అన్నవరపు వెంకటేశ్వర్లు, మార్టూరి లక్ష్మయ్య, వి.శివ ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, అప్పలనాయుడు, బాలకృష్ణ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ



పిడుగురాళ్ల: మిరపకాయలు కోసేందుకు కూలీలు వెళ్తున్న ఆటోను వెనుక వైపు నుంచి లారీ ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలైన సంఘటన తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. తుమ్మలచెరువు గ్రామానికి చెందిన కొంత మంది కూలీలు పొలాలకు మిరప కాయలు కోసేందుకు ఆటోలో వెళ్తున్నారు. తుమ్మలచెరువు టోల్‌ప్లాజా వద్ద లారీ ఢీకొనటంతో ఆటోలో ప్రయాణిస్తున్న అంజలి, శివమ్మ, జగన్‌కుమారిలకు గాయాలు అయ్యాయి. టోల్‌ప్లాజా అంబులెన్స్ సహాయంలో క్షతగాత్రులను పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

ఎంఈవో–2 బాలసుందరరావు



బెల్లంకొండ: తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి–2 బాలసుందరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని కందిపాడు గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి 'ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని తెలిపారు. ఉచిత పుస్తకాల పంపిణీ, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, అన్ని వసతులు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని తల్లిదండ్రులకు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలు సేకరించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.



రెంటచింతల: కానుకమాత చర్చి ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలో క్రైస్తవులు



కానుకమాత చర్చి ఆవరణలో శిలువ ధారి ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు



రెంటచింతల: ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థన దృశ్యం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

- చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాల్లో క్రైస్తవులు
- క్రీస్తు త్యాగాన్ని గుర్తుచేసేలా ప్రదర్శనలు

విజయపురి సౌత్: గుడ్ ఫ్రై డేను పురస్కరించుకొని సాగర్‌మాత దేవాలయంలో శుక్రవారం ప్రదర్శించిన క్రీస్తు శిలువ యాత్ర ప్రదర్శన చూపరులను కంటతడి పెట్టించింది. లోకంలో అందరి పాపాలను తొలగించేందుకు కల్వరిగిరిలో శిలువను భుజం మీద మోసుకొని ఏసు పడిన కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ దృశ్యాలను తిలకించిన భక్తుల మనస్సులు చలించాయి. ఏసు శిలువ యాత్రలో ముఖ్య ఘట్టాలు కంటతడి పెట్టించాయి. క్రీస్తు పాత్రను దుగ్గెంపూడి సుభాష్‌రెడ్డి రక్తి కట్టించారు. అనంతరం దేవాలయంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ దివ్యబలిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. దీనికి ముందు ఉదయం సాగర్‌మాత ఆలయంలో వేలాది మంది భక్తులు ఉపవాస దీక్షలో పాల్గొన్నారు. 40 రోజులపాటు మాలలు ధరించిన సాగర్‌మాత భక్తులు ప్రార్థనలు నిర్వహించాక మాలలు విరమించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పెద్దలు డి.ఇన్నారెడ్డి, జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌర్రాజు, కట్టారాజు, శౌరిబాబు, ఎం.మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతలలో....

రెంటచింతల: యెహోవా దేవుని కుమారుడైన ఏసుక్రీస్తు భూలోకంలోని పాపులను రక్షించుటకు శిలువ మరణం పొందారని కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్ధుమర్రెడ్డి అన్నారు. స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో సహాయ గురువులు జి. అగస్టీన్‌తో కలిసి గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన మాట్లాడారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు చివరి గడియలలో పడిన శ్రమలను కళ్లకు కట్టినట్లుగా భక్తులకు ప్రత్యక్షంగా ప్రదర్శించడం అభినందనీయం అన్నారు. ముందుగా ఫాదర్లు విచారణ గురువులు వైఎల్ మర్రెడ్డి ప్రార్థనలు ప్రారంభించారు. వేలాదిమంది కథోలికులు ఏసుక్రీస్తు శిలువ ధారుణను తిలకించి క్రీస్తు ముద్దు చేయడంతో ముగించారు. తపస్సుకాల దీక్షలను భక్తులు శనివారం ఉదయం 7 గంటలకు విరమింపచేయడం జరుగుతుందని ఫాదర్ లూర్ధుమర్రెడ్డి తెలిపారు. స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో రెవ. పరాస్టర్ దేగల దేవానంద్, తుమృకోట ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ చర్చిలో రెవ. సీహెచ్ అశోక్ ఆధ్వర్యంలో, పాలువాయి, మంచికల్లు, పశర్లపాడు, రెంటాల, జెట్టిపాలెం తదితర గ్రామాలలోని ప్రార్థన మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలలో ప్రార్థనా మందిరాలలో క్రీస్తు విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



దాచేపల్లి: శిలువ యాత్ర ప్రదర్శిస్తున్న లూథరన్ సంఘస్తులు



విజయపురి సౌత్: సాగర్‌మాత ఆలయంలో క్రీస్తు శిలువ యాత్ర ప్రదర్శన

దాచేపల్లిలో..

దాచేపల్లి: సర్వ మానవాళిని పాపముల నుంచి విముక్తి కలిగించేందుకు ప్రభువైన ఏసుక్రీస్తు శిలువపై మరణం పొందారని పాస్టర్ జయపాల్ అన్నారు. మండల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే ప్రత్యేక ప్రార్థనలు శుక్రవారం జరిగాయి. దక్షిణగడ్డ లూథరన్ చర్చి సభ్యులు శిలువ యాత్ర చేపట్టారు. కేసానుపల్లి లూథరన్ చర్చి సభ్యులు యాత్రతో గ్రామ పురవీధుల్లో తిరిగారు. ఏసుక్రీస్తు శిలువలో పలికిన ఏడు మాటల గురించి చర్చిల్లో ధ్యానం చేశారు. పాస్టర్ జయరాజ్ మాట్లాడుతూ.. మనుషల పాపాల కోసం మరణించి ఏకైక దేవుడు ఏసు క్రీస్తు అని, క్రీస్తు మరణం ఈ లోకానికి రక్షణ అని చెప్పారు. కేసానుపల్లి లూథరన్ చర్చిలో జరిగిన ప్రార్థనలో పాస్టర్ జి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ క్రీస్తు మరణం ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగు ఇస్తుందని, పాప క్షమాపణ కలిగిన జీవితం జీవించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు వినుకొండ బాబు, శ్రీపతి కాశయ్య, మీసాల నతానియేలు, చెట్టిపాగు అంకయ్య, చెట్టిపాగు పిచ్చయ్య, వినుకొండ సుధీర్, వినుకొండ కోటేశ్వరరావు, చెట్టిపాగు ఏసుదాసు, కొమ్మా కరుణకర్, కొండవీటి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

గురజాలలో..

గురజాల: ఓర్పు, త్యాగం, సహనం, ప్రేమ, కరుణకు మార్గం క్రీస్తు శిలువ మరణమని చర్చిలో పలువురు పాస్టర్లు సూచించారు. నియోజకవర్గ కేంద్రం గురజాలలో గుడ్ ఫ్రై డే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ దైవ దూత ఏసు మార్గం మానవత్వమేగానీ మతం కాదన్నారు. ప్రతి ఒక్కరూ మారు మనస్సు పొంది రక్షణ పొందాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పలు చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. గుడ్‌న్యూస్ ఇంగ్లిషు మీడియం పాఠశాలకు చెందిన చర్చి సభ్యులు క్రీస్తు శిలువ మరణం గురించి ప్రజలకు అవగాహన కల్పించే విధంగా గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. విశ్వాసులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో..

పిడుగురాళ్ల: పట్టణంలో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లోని లూథరన్ చర్చి, పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చి, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆర్‌సీఎం చర్చిలో క్రిస్టియన్ సోదరులు అధిక సంఖ్యలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే ప్రాముఖ్యతను తెలియజేసి, దేవుని సందేశాన్ని వినిపించారు.

మాచవరంలో...

మాచవరం: సర్వమానవాళిని పాపముల నుంచి రక్షించుటకు ఏసుక్రీస్తు శిలువపై ప్రాణత్యాగం చేశారని పాస్టర్లు వి.గురుప్రసాద్, ఎం.జీవితప్రకాష్, డేవిడ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ సోదరులు ఉపవాస ప్రార్థనలు చేపట్టారు. స్తుతి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు దైవ సందేశాన్ని వినిపించారు. క్రీస్తు మరణం దేవుడి చిత్త ప్రకారమేనని ఉపదేశించారు. శిలువపై క్రీస్తు పలికిన ఏడు మాటల ప్రాముఖ్యతను వివరించారు. క్రీస్తు చూపిన సన్మార్గంలో పయనించిన వారికి పరలోక రాజ్యంలో చోటు దొరుకుతుందని తెలియజేశారు. మాచవరం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన శిలువ యాత్ర ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆయా గ్రామాల్లోని పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

దుర్గిలో...



దుర్గి: లోకంలో సమస్త మానవాళి చేసిన పాపాల కోసం ప్రభువు శిలువపై పలికిన ఏడు మాటలతోపాటు ప్రాణాలర్పించటం గొప్ప విషయమని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం వ్యవస్థాపకుడు కుక్కమూడి ప్రసాద్ అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ముటుకూరులోని ఆంధ్ర ఇవాంజిలికల్ క్రీస్తు లూథరన్ దేవాలయంలో వేడుకలను జరిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్ రెవ. కటికల ఏసుదానం, మాచర్ల జాన్, మోజెస్, పాస్టర్ మరియమ్మ, మాచర్ల సామేలు, పులిమెల వెంకయ్య, మాచర్ల పెద రామయ్య దానయ్య, మరియదాసు, ఏసోబు, వసంత్ తదితరులు పాల్గొన్నారు.



గురజాల: అవగాహన కార్యక్రమంలో గుడ్ న్యూస్ పాఠశాల సిబ్బంది

యువతకు కన్నెగంటి స్ఫూర్తి ప్రదాత

రెంటచింతల: స్వాతంత్ర్య సమరయోధుడు, పుల్లరి ఉద్యమకారుడు కన్నెగంటి హనుమంత్‌ను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సింహాద్రి మోహన్ అన్నారు. శుక్రవారం కన్నెగంటి హనుమంత్ జయంతిని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కన్నెగంటి హనుమంత్ ఫౌండేషన్ అధ్యక్షుడు, విద్యావేత్త నారాయణపురం శ్రీనివాస్‌తో కలిసి ప్రిన్సిపల్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... తెల్ల దొరల గుండెల్లో వణుకు పుట్టించిన తొలి తరం విప్లవ యోధుడు కన్నెగంటి అని కొనియాడారు. పల్నాడు ప్రాంత పుల్లరి ఉద్యమంలో, దేశ స్వాతంత్ర్య పోరాటంలో హనుమంత్ చిన్న వయస్సులోనే చురుగ్గా పాల్గొన్నారని గుర్తుచేశారు. ఆంగ్లేయుల చేతిలో వీరమరణం పొంది పల్నాటి ప్రజల హృదయాలలో ఆరాధ్యుడిగా చెరగని ముద్ర వేశారన్నారు. అనంతరం విద్యార్థులతో గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. మాచర్ల – గుంటూరు ప్రధాన రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యమేరి, ఎం.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



కన్నెగంటి చిత్రపటానికి నివాళులు అర్పించిన సింహాద్రి మోహన్, నారాయణపురం శ్రీనివాస్

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

పిడుగురాళ్ల: అగ్నిప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అగ్నిమాపక శాఖ అధికారి కె. శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలో హెచ్‌పీ పెట్రోల్ బంకు, జానపాడు రోడ్డులోని సూర్య డెకో ప్రొడక్షన్స్ ఇండస్ట్రీ, శ్రీ వెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్‌లలో అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కరపత్రాలు పంపిణీ చేశారు. మాక్ డ్రిల్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ... అగ్ని ప్రమాదాలు ఎలా జరుగుతాయో తెలిసస్తే రక్షించుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రమాదాలు సంభవించిన వెంటనే ప్రాథమిక చర్యలు తీసుకొని అగ్నిమాపక శాఖ కార్యాలయానికి ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో బి.పేరరెడ్డి, యు.రామవర ప్రసాద్, కె.చంద్రశేఖర్, అగ్నిమాపక శాఖ సిబ్బంది పీవీ సుబ్బారావు, ఎస్.శ్రీనివాసరెడ్డి, బి.వెంకటేశ్వర్లు నాయక్, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



వీసపాడు(క్రోసూరు): మండలంలోని వీసపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల (ఎస్సీ) వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోలు ఏకుల ప్రసాదరావు, ఎం.గణేష్, 88 తాళ్లూరు కాంప్లెక్స్ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ హాజరయ్యారు. హెచ్‌ఎం పి.పిచ్చయ్య అధ్యక్షత వహించారు. ఎంఈవోలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాల పూర్వ విద్యార్థి తాళ్నూరి రాజశేఖర్ తన తండ్రి పేరు మీద ఒక చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి దానిని ఎంఈవోలచే ప్రారంభింపజేశారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు, ఇంగ్లీష్ రోల్ ప్లే, హిందిలో దేశభక్తి గేయాలు అలరించాయి. వీసపాడు గ్రామ సర్పంచ్ కోటమ్మ, గ్రామ పెద్దలు కంచేటి నరసింహారావు, పాఠశాల చైర్మన్ మేకల రమేష్ పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు జంగం కోటేశ్వరరావు, రాఘవరావు, ఖాజావలి, పూర్వ హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు హరిప్రియ, జ్యోత్స్న, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బీసీ నేతకు నివాళి



మాచవరం: మండల కేంద్రమైన మాచవరం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గడ్డం రాములు కుమారుడు, వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు గడ్డం సైదయ్య అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ సందర్శించారు. పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారి వెంట జెడ్పీటీసీ శివాయాదవ్, గ్రామ సర్పంచ్ రాగిడి నరేష్, ఎంపీటీసీ గురవయ్య, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు అంబటి కోటయ్య, మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రేపు వేల్పూరులో ప్రతిష్టా మహోత్సవం

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో వేంచేసియున్న వీరబ్రహ్మేంద్ర విజ్ఞాన ఆశ్రమంలో పీఠాధిపతి బ్రహ్మదాసు నాయణ ఆరాధన ఉత్సవాలు నేటి నుంచి రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, సెక్రటరి దేసు మల్లిఖార్జునరావులు శుక్రవారం తెలిపారు. ఈనెల 20న శ్రీ బ్రహ్మదాను నాయ ణ విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం ఉదయం 10.56 నిమిషాలకు జరుగుతుందని, ముఖ్య అతిథులుగా అచలానంద ఆశ్రమ ఒంగోలు పీఠాధిపతి పరిపూర్ణ సిద్దానంద స్వామి, బ్రహ్మంగారిమఠం తోటపల్లి ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వాముల పాల్గొంటారన్నారు.

మాదలలో అగ్ని ప్రమాదం



ప్రమాదంలో కాలిపోయిన ద్విచక్ర వాహనాలు

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. గ్రామానికి చెందిన గున్నం వెంకటేశ్వరరెడ్డికి చెందిన గేదెల పాకలో అర్ధరాత్రి దాటాక హఠాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఆరు గదుల గేదెల కొట్టంతో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, రెండెకరాల వరిగడ్డి పూర్తిగా కాలిపోయినట్లు వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం ఉంటుందని బాధితుడు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ ఎమ్మెల్యే కాసు పరామర్శ

దాచేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ పట్టణ కన్వీనర్ మునగా పున్నారావు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పున్నారావు తల్లి భూదేవమ్మ రెండు రోజుల క్రితం మృతి చెందారు. ఈ నేపథ్యంలో దాచేపల్లిలోని పున్నారావు ఇంటిలో భూదేవమ్మ చిత్రపటానికి కాసు నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే కాసు వెంట పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభాని, కోట కృష్ణ, ఎంపీపీ కందుల జాను, నాయకులు షేక్ ఖాదర్ బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, పల్లె వెంగళరెడ్డి, షేక్ దాడీ, వంగా పద్మావతి తదితరులున్నారు.



భూదేవమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాసు మహేష్‌రెడ్డి

108 వాహనంలోనే ప్రసవం



బెల్లంకొండ: పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళను 108 వాహనంలో వైద్యశాలకు తరలించే క్రమంలో 108 వాహనంలోనే గురువారం రాత్రి ప్రసవించింది. మండలంలోని మాచయపాలెం గ్రామానికి చెందిన ఆరుమల్ల ప్రసన్నకుమారి నిండు గర్భిణి. గురువారం రాత్రి 8 గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. కాగా అంబులెన్స్ సిబ్బంది వెంటనే ప్రసన్నకుమారిని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లారు. పీహెచ్‌సీ సిబ్బంది ప్రసన్నకుమారికి పరీక్షలు నిర్వహించి, హై రిస్క్ డెలివరీ అంటూ వైద్యుల సూచన మేరకు నరసరావుపేట ప్రభుత్వ అసుపత్రికి రిఫర్ చేశారు. వెంటనే కుటుంబ సభ్యులు అదే 108 వాహనంలో నరసరావుపేటకు తీసుకెళ్తుండగా మార్గంమధ్యలోనే ప్రసన్నకుమారి ఆడబిడ్డను ప్రసవించింది. ఈఎంటీ గోపి, పైలెట్ నాగరాజు, ఆశా కా ర్యకర్త ప్రసవం చేశారు. పీహెచ్‌సీలో హైరిస్క్ డెలివరీ అని చెప్పారని, 108 సిబ్బంది సులభంగా డెలివరీ చేసారని మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా బుధవారమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి, వైద్యశాలలో ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించినప్పటికీ పీహెచ్‌సీ సిబ్బంది ఆ మాటలను పెడచెవిన పెడుతున్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

సత్తెనపల్లి: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, టాలీ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరి ప్రసాద్ శుక్రవారం తెలిపారు. శిక్షణ కాలంలో భోజనం, వసతి సౌకర్యం కల్పించబడతాయన్నారు. మరిన్ని వివరాలకు 90004 87423 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.